క్లుప్తంగా

యాదవ సంఘం హర్షం



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): ఎమ్మెల్సీ అభ్యర్థుల్లో శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నియోజకవర్గానికి చెందిన యాదవ సామాజిక వర్గానికి చెందిన నర్తు రామారావుకు స్థానం కల్పించడం పట్ల జిల్లా యాదవ సంఘం హర్షం వ్యక్తం చేసింది. స్థానిక ఏటిగట్టులోని సంఘం జిల్లా కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో సంఘ నాయకులు మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉక్కుసూరి గోపాలకృష్ణ, జిల్లా అధ్యక్షుడు చిదరబోయిన శ్రీనివాసరావు, నాయకులు కిలారపు బుజ్జి, ఆకుల గంగాధరరావు పాల్గొన్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ



పేదలకు కొత్త బట్టలు అందించిన దృశ్యం

ఏలూరు రూరల్: ఏలూరు సమీపంలోని తంగెళ్లమూడి వద్ద నివసించే పేదలకు రివర్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు మంగళవారం దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ కాటూరి సుధాకర్ మాట్లాడుతూ మదర్ థెరిస్సా చెప్పిన ప్రార్థించే పెదవులు కన్నా సాయం చేసే చేతులు ఎంతో గొప్పవన్న భావాన్ని ఆదర్శంగా తీసుకొని కొన్నేళ్లుగా సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్తేర్ రాణి, పద్మావతి, అబ్రహాం, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు



ఆంజనేయ స్వామికి అభిషేకం చేస్తున్న భక్తులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రామకోటి మహోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం ప్రత్యేక పూజలు, మౌనధ్యానం, భక్తిగీతాలపనలు, హరేరామ సంకీర్తనలు, నిత్య హోమం, స్వామి నిత్య కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం 9.30 గంటలకు హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. స్వామి వారికి తమలపాకు పూజ, పానకంతో విశేష అభిషేకం నిర్వహించారు. స్వామి వారికి విశేష అలంకరణ చేశారు. సాయంత్రం కైకలూరుకు చెందిన భగవద్గీత ప్రచారకులు ఘంటసాల బసవయ్య దశావతార ప్రవచనాలు చేశారు. రాత్రి గంటలకు కపిలేశ్వరపురానికి చెందిన నేమాని నాగలక్ష్మి భాగవతారిణి ఆదిశంకరాచార్యపై హరికథా కాలక్షేపం చేశారు.

రాష్ట్ర స్థాయి క్రీడల్లో ప్రతిభ చూపాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక సెయింట్ థెరిస్సా బాలికోన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు రాష్ట్ర స్థాయిలో త్వరలో జరిగే వివిధ క్రీడా పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ చూపి పతకాలు సాధించాలని కరస్పాండెంట్ సిస్టర్ సునీల పేర్కొన్నారు. మదర్ ఎగ్నీకట్ట పండుగను పురస్కరించుకుని మగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఇటీవల జిల్లా స్థాయి, నియోజకవర్గ స్థాయిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ క్రీడా పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు విజేతలుగా నిలిచారన్నారు. వీరు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని అభినందించారు. జాతీయ స్థాయి పోటీలకు కూడా ఎంపిక కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ వి.శాంతమ్మ, పీఈటీ వై.మురళీకృష్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాతృభాషా దినోత్సవం



సీఆర్‌ఆర్ కళాశాలలో శ్రీలక్ష్మిని సన్మానించిన దృశ్యం



వైఎంహెచ్‌ఏ హాలులో తెలుగుతల్లి విగ్రహం వద్ద ప్రతినిధులు



శాంతకు పురస్కారం ప్రదానం చేస్తున్న గరికపాటి ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. మాతృభాషకు, అమ్మకు విడదీయరాని సంబంధం ఉందని, భావ వ్యక్తీకరణకు మాతృభాషే అనుకూలమని రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్మన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి అన్నారు. స్థానిక సీఆర్‌ఆర్ అటానమస్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. భారతవర్ష కావ్య రచయిత పూలబాల వెంకట ప్రసాద్ మాట్లాడుతూ మాతృభాషను చిన్నచూపు చూడడం తగదన్నారు. కళాశాల కరస్పాండెంట్ కేఎస్ విష్ణు మోహన్ మాట్లాడుతూ మాతృభాషలో వెనుకబడడం వల్ల ఆలోచనశక్తి, భావవ్యక్తీకరణ శక్తి, మేథో వ్యవస్థ కుప్పకూలిపోతోందన్నారు. ఈ సందర్భంగా పిల్లంగోళ్ల శ్రీలక్ష్మిని ఘనంగా సత్కరించారు. ప్రిన్సిపాల్ కేఏ రామరాజు, తెలుగుశాఖాధిపతి ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

భాషా, సాంస్కృతిక కళల అభివృద్ధికి కృషి

భాషా, సాంస్కృతిక కళలను ముందుతరానికి తీసుకెళ్లడానికి వైఎంహెచ్‌ఏ సంస్థ కృషి చేస్తోందని యర్రా సోమలింగేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక వైఎంహెచ్‌ఏ హాలులో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రధాన కార్యదర్శి కేవీ సత్యనారాయణ మాట్లాడుతూ ప్రపంచ భాషల్లో తెలుగుభాషకు ప్రత్యేకత ఉందన్నారు. తెలుగుతల్లి విగ్రహానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. మజ్జి కాంతారావు, ఎల్.వెంకటేశ్వర రావు, గుడిపాటి లలితాశర్మ, బీవీ సుబ్రహ్మణ్యం, లంకా వెంకటేశ్వర్లు, సీహెచ్ సాయితేజ, మోతే శ్రీనివాస నారాయణ రావు, దువ్వి హేమసుందర్ తదితరులు పాల్గొన్నారు.

సాహిత్య మండలిలో..

స్థానిక రామకృష్ణాపురంలోని సాహిత్య మండలి హాలులో గరికపాటి ఆర్ట్స్ థియేటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో తెలుగు భాషకు విశేష కృషి చేసిన దేవరకొండ శాంతకు గరికపాటి కల్యాణి తెలుగు సాహితీ పురస్కారం ప్రదానం చేశారు. విద్యార్థులకు మైలవరపు గురు శర్మ పద కూర్పు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో షణ్ముఖ సాయిరామ్ చరణ్ (శనివారపు పేట హైస్కూల్), కావ్యశ్రీ (ఎల్‌బీసీ స్కూల్), జి.ఏ సుబాబు (గాంధీ స్కూల్) వరుసగా ప్రథమ, ద్వితీ, తృతీయ బహుమతులు గెలుపొందారు. కార్యక్రమానికి గరికపాటి కాళిదాసు అధ్యక్షత వహించగా సన్నిధానం రామలక్ష్మి, పుల్లాభొట్ల పురుషోత్తమ రావు, పల్లా గంగాధర చయనులు, కోట లక్ష్మీ నరసింహం, జీవీఎల్ఎన్ మూర్తి, పుల్లాభొట్ల సత్యవాణి తదితరులు పాల్గొన్నారు.

శనివారపుపేట జడ్పీ పాఠశాలలో..

ఏలూరు రూరల్: శనివారపుపేట జడ్పీ పాఠశాలలో ఇన్‌చార్జి హెచ్‌ఎం రాజేశ్వరి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఏపీయూఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజ్‌కుమార్‌తో పాటు తెలుగు ఉపాధ్యాయులు లోకేశ్వరి, మూర్తి, రేఖ తెలుగు భాష గొప్పదనాన్ని వివరించారు. బాలికలు జానపద, శాస్త్రీయ నృత్యం చేసి అలరించారు. నాగలక్ష్మి బృందం కోలాటం, శివ తాండవం ఆకట్టుకున్నాయి.

డీఎస్పీ పైడేశ్వరరావుకు అభినందనలు



డీఎస్పీ పైడేశ్వరరావును అభినందిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం (ఏఐఏవైఎస్) ఆధ్వర్యంలో ఏలూరు డీఎస్పీ పైడేశ్వరరావుకు సంఘం నాయకులు అభినందనలు తెలిపారు. సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మెండెం సంతోష్ కుమార్ అధ్యక్షతన స్థానిక డీఎస్పీ కార్యాలయంలో మంగళవారం పైడేశ్వరరావును కలిసి సత్కరించారు. ఇటీవల నిర్వహించిన ఎస్సై ఉద్యోగాల పరీక్షల్లో ఒక అభ్యర్థిని సీఆర్‌ఆర్ అటానమస్ కాలేజ్‌లో పరీక్ష రాయాల్సి ఉండగా, వట్లూరు సీఆర్‌ఆర్ ఇంజినీరింగ్ కాలేజ్ పరీక్షా కేంద్రానికి వెళ్లిన ఆమెను సంబంధిత పరీక్షా కేంద్రానికి డీఎస్పీ పైడేశ్వరరావు మానవత్వంతో సకాలంలో తీసుకెళ్లడం అభినందనీయమన్నారు. డీఎస్పీని కలిసిన వారిలో ఏఐఏవైఎస్ నాయకులు పల్లా యేసేబు,ఉప్పే ధనుంజయ, కె.రాజేష్, కె.పెద్దిరాజు తదితరులు ఉన్నారు.

కులమతాలకు అతీతంగా జీవించాలి



వెంకట్రావును సన్మానిస్తున్న వేదిక ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రతి ఒక్కరూ మహాపురుషుల అడుగుజాడల్లో నడుచుకోవాలని, కులమతాలకు అతీతంగా జీవనం సాగించాలని సామాజిక సమరసత వేదిక జాతీయ కన్వీనర్ కె.శ్యాం ప్రసాద్ సూచించారు. సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక పత్తేబాద సాయిరాధ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంత్ రవిదాసు, బోయి భీమన్న, గుర్రం జాషువా, మహాత్మా జ్యోతిరావు పూలే, సంత్ సేవాలాల్, బాబా సాహెబ్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్ రామ్ వంటి వారి జీవిత చరిత్రలను తెలుసుకోవాలన్నారు. దేశం, ధర్మం అనుసరించి ప్రవర్తించాలని, కులాల మధ్య సమన్వయం చేయడమే సమరసతా వేదిక ప్రధాన ఉద్దేశమని అన్నారు. కార్యక్రమంలో సంత్రవిదాస్ జన్మదినం సందర్భంగా చర్మకార సామాజికవర్గానికి చెందిన వెంకట్రావును సన్మానించారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ ఐక్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గరికముక్కు సుబ్బయ్య, జిల్లా కన్వీనర్ మజ్జి నాగరాజు, జిల్లా కన్వీనర్‌లు గొట్టుముక్కల జాషువా, ఎన్‌వీ నారాయణ రావు తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు టూటౌన్‌లో దుర్గంధం

- రోడ్లు, డ్రెయినేజీల పైనే నిర్మాణ సామగ్రి
- ఆర్‌ఆర్‌పేట, పత్తేబాద ప్రాంతాల్లో దుస్థితి
- ప్రజలకు తప్పని అవస్థలు



జీవీమాల్ సెంటర్‌లో పూడుకుపోయిన డ్రెయినేజీ



ఆర్‌ఆర్‌పేట రోడ్డులో భవన నిర్మాణంతో డ్రెయినేజీ దుస్థితి



ఆర్‌ఆర్‌పేట రోడ్డు మధులత కాంప్లెక్స్ ఎదురుగా..



సెయింట్ థెరిస్సా స్కూల్ వెనుక రోడ్డులో దుస్థితి

ఏలూరు టౌన్: ఏలూరు నగరాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికతో కృషి చేస్తోంది. నగరపాలక సంస్థ పాలకమండలి, అధికార యంత్రాంగం ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు పనిచేయాల్సుంది. ఎమ్మెల్యే ఆళ్ల నాని భారీగా నిధులు ఖర్చు చేసి ఇప్పటికే నగరంలోని ప్రధాన రోడ్లన్నీ నిర్మించారు. ఇదంతా బాగానే ఉన్నప్పటికీ కార్పొరేషన్ అధికారులు నగరంలో పలు రోడ్లు, డ్రెయినేజీలపై భవన సామగ్రి దిగుమతి చేసి మురుగునీటి పారుదలకు, రాకపోకలకు ఆటకం కలిగిస్తున్నా పట్టించుకోవడంలేదని నగర ప్రజలు వాపోతున్నారు.

ముక్కు మూసుకోవాల్సిందే

ఏలూరు ఆర్‌ఆర్‌పేట, పత్తేబాద రోడ్లన్నీ ప్రధాన మార్కెట్‌గా రూపాంతరం చెందాయి. ఈ రోడ్లను ప్రభుత్వం పక్కాగా వేయించి, ప్రజలకు మెరుగైన సౌకర్యాల కల్పనకు చర్యలు చేపట్టింది. కానీ ఆర్‌ఆర్‌పేట జీవీమాల్ సెంటర్ ప్రధాన కూడలిలో వస్తోన్న దుర్గంధానికి ముక్కుపుటాలు పగిపోతున్నాయి. డ్రెయినేజీ వ్యర్థాలతో పూడుకుపోయింది. ప్రధాన రహదారి వెంబడి ఉండాల్సిన డ్రెయినేజీలో నీరు పారుదల లేక వ్యర్థాలు కుళ్లి దుర్గంధం వ్యాపిస్తోంది. ఐనా అధికారులు పట్టించుకోని పరిస్థితి నెలకొందని నగరవాసులు వాపోతున్నారు.

'దారి' లేకుండా పోయింది

ఆర్‌ఆర్‌పేట ప్రధాన రహదారిలో ఒక భారీ భవన నిర్మాణం చేపట్టారు. యజమాని డ్రెయినేజీ పైనే భవన నిర్మాణ సామగ్రి, చెత్తాచెదారం వేస్తున్నారు. నెలల తరబడి ఈ పరిస్థితి ఉన్నా అధికారులు, సిబ్బందికి పట్టించుకోవడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్‌ఆర్‌పేట వైపు నుంచి సెయింట్ థెరిస్సా రెండో గేటు వైపు వీధి పూర్తిగా ఆక్రమణలకు గురవుతోంది. రోడ్లపైనే వ్యాపారాలు నిర్వహిస్తుండడంతో అటుగా వెళ్లేందుకు దారి లేకుండా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

సిల్టు తొలగింపునకు స్పెషల్ డ్రైవ్

నగరంలోని ప్రధాన డ్రెయినేజీల్లో పేరుకుపోయిన సిల్టును తొలగించేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తాం. చిన్న చిన్న డ్రెయినేజీల్లో చెత్త, వ్యర్థాలు పేరుకుపోకుండా నిత్యం పారిశుధ్య కార్మికులు శుభ్రం చేస్తున్నారు. ఏప్రిల్ నెలలో టెండర్లు పిలిచి ప్రధాన డ్రెయినేజీల్లో సిల్టును పూర్తిగా తొలగించే కార్యక్రమం చేపడతాం. ఆర్‌ఆర్‌పేట ప్రధాన రహదారిలో డ్రెయినేజీల్లో నీటిపారుదలకు ఆటంకంతో సమస్య ఏర్పడితే వాటిని పరిశీలించి, పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం.

– సంక్రాంతి వెంకటకృష్ణ, ఏలూరు నగర కమిషనర్

మెరుగైన వైద్య సేవలకు కృషి

ఏలూరు రూరల్: గుడివాకలంక, చాటపర్రు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా ఏలూరు మండల గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందేలా చూస్తామని మండలపరిషత్ అధ్యక్షుడు, పీహెచ్‌సీ పాలకవర్గ చైర్మన్ పెన్మత్స శ్రీనివాసరాజు అన్నారు. మంగళవారం ఆయన గుడివాకలంక, చాటపర్రు పీహెచ్‌సీ కేంద్రాలను పరిశీలించారు. గుడివాకలంక పీహెచ్‌సీలో డాక్టర్ ఆనంద్‌కుమార్, మాజీ ఎంపీపీ జయమంగళ రామారావు, కొక్కిరాయిలంక సర్పంచ్ తోకల అమలతో సమావేశం నిర్వహించారు. గుడివాకలంక పీహెచ్‌సీలో కొల్లేరు గ్రామాల్లో గర్భిణులు సుఖ ప్రసవం చేసేందుకు ప్రభుత్వం మహిళ గైనకాలజిస్టును నియమించేలా కృషి చేస్తానని ఎంపీపీ అన్నారు. రక్త, మూత్ర పరీక్షలతో పాటు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు మరిన్ని అధునాతన పరికరాలు అందుబాటులో ఉండేలా చూడాలని డాక్టర్‌కు సూచించారు. ఆసుపత్రి ఆవరణ మరింత సుందర, ఆహ్లాదకర వాతావరణ కనిపించాలన్నారు. పీహెచ్‌సీని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌గా మార్చేందుకు కృషి చేయాలని జయమంగళ రామారావు ఎంపీపీని కోరారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ సెక్రటరీ రాజేశ్వరి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రహదారి భద్రతా నియమాలు పాటించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి సూచించారు. మంగళవారం స్థానిక సెయింట్ థెరిస్సా కళాశాలలో విద్యార్థినులకు ట్రాఫిక్ నిబంధనలు, వాహన చట్టం, డ్రైవింగ్ లైసెన్స్ తీసుకునే విధానం, న్యాయ సేవాధికార సంస్థ కార్యకలాపాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. వాహనచోదకులంతా తప్పని సరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన వారు మాత్రమే వాహనాన్ని నడపాలని, మైనర్లు వాహనాలు నడిపితే వాహన యజమాని శిక్షార్హులౌతారని రాజేశ్వరి హెచ్చరించారు. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జి.స్వామి మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో డ్రైవింగ్ లైసెన్స్ పొందే విధానాన్ని విద్యార్థినులకు డెమో ద్వారా నేర్పారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ రజిత, లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

సమాజంపై శ్రీశ్రీ రచనల ప్రభావం



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీతారాం

ఏలూరు (టూటౌన్): శ్రీశ్రీ తన రచనలతో సమాజంపై ఎనలేని ప్రభావం చూపించారని సాంస్కృతిక రంగం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం అన్నారు. రెడ్ బుక్ డే సందర్భంగా మంగళవారం సాయంత్రం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో సాహితీ స్రవంతి నాయకులు కె.రామాంజనేయులు అధ్యక్షతన రెడ్ బుక్ డే సందర్భంగా శ్రీశ్రీ మహాప్రస్థానం పుస్తక పఠన కార్యక్రమం నిర్వహించారు. ప్రపంచంలో కార్ల్ మార్క్స్, ఎంగెల్స్‌లు రచించిన కమ్యూనిస్టు ప్రణాళిక అనే చిన్న పుస్తకం సరిగ్గా ఇదేరోజు విడుదల చేశారని, ఈ పుస్తకం ప్రపంచ వ్యాప్తంగా చాలా ప్రభావం చూపిందని సీతారాం గుర్తుచేశారు. దీంతో ఆయా భాషల్లో అనేకమంది రచయితలు, కవులు గొప్పగొప్ప రచనలు చేశారన్నారు. ఆ కోవలోకే తెలుగులో శ్రీశ్రీ వస్తారన్నారు. శ్రీశ్రీ విప్లవ రచయితే కాకుండా ప్రఖ్యాత సినిమా కవి కూడా అని అన్నారు. కార్యక్రమంలో ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు, హేలాపురి బాలోత్సవం అధ్యక్షుడు ఆలపాటి నాగేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎ.రవి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్, పి.హైమావతి, సీహెచ్ సుందరయ్య, కట్టా సత్యనారాయణ, విజిఎంఆర్ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు. అంతర్జాతీయ తెలుగు భాష దినోత్సవం సందర్భంగా సీతారాం తదితరులు గురజాడ అప్పారావు, గిడుగు రామమూర్తి, కందుకూరివీరేశలింగం పంతులు చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు.

వీరవల్లి రైల్వే స్టేషన్‌లో వ్యక్తి ఆత్మహత్య

ఏలూరు టౌన్: ఏలూరు రైల్వేస్టేషన్ పరిధిలోని వీరవల్లి రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని యువకుడు రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. వీరవల్లి రైల్వేస్టేషన్‌లో సుమారు 20 నుంచి 25 ఏళ్ల వయసు గల గుర్తు తెలియని యువకుడు రైలుకిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు సుమారు 5.4 అడుగుల ఎత్తు, నలుపు రంగు జుట్టు, తెలుపురంగు ఛాయ కలిగి ఉన్నాడు. మృతుడి ఒంటిపై కుంకుమ రంగు పొడవు చేతుల చొక్కా, నలుపు రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడు. ఏలూరు రైల్వే ఎస్సై డి.నరసింహారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వ బోధనాసుపత్రి మార్చురీకి తరలించారు. మృతుని వివరాలు తెలిసిన వారు ఫోన్ 94406 27572కు సంప్రదించాలని ఆయన కోరారు.

26న సుబ్బమ్మదేవి స్కూల్ వజ్రోత్సవాలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావుపేటలోని ఈదర సుబ్బమ్మదేవి నగరపాలక ఉన్నత పాఠశాల వజ్రోత్సవ వేడుకలు ఈ నెల 26న నిర్వహించనున్నట్టు ప్రధానోపాధ్యాయుడు పి.కుటుంబరావు, పూర్వ విద్యార్థుల చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు వి.రత్న కుమార్ పేర్కొన్నారు. స్కూల్ విశిష్టతను తెలిపేలా ఈ నెల 23న మధ్యాహ్నం 3 గంటలకు 200 ద్విచక్ర వాహనాలతో భారీ బైక్ ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు.

పోస్టర్ రహిత నగరంగా తీర్చిదిద్దుతాం



పోస్టర్లను తొలగింపజేస్తున్న కమిషనర్ వెంకటకృష్ణ

ఏలూరు టౌన్: ఏలూరు నగరాన్ని పోస్టర్ రహితంగా తీర్చిదిద్దేందుకు, సుందరీకరణ చేసేందుకు ప్రజలంతా సహకరించాలని కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ అన్నారు. నగరంలో మంగళవారం పాతబస్టాండ్ సెంటర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి కొత్త బస్టాండ్ వరకూ రోడ్లు వెంబడి ఉన్న పోస్టర్లను తొలగించే కార్యక్రమాన్ని ఆయన స్వయంగా పర్యవేక్షించారు. నగరంలోని ప్రభుత్వ కార్యాలయాల గోడలు, రోడ్డు వెంబడి గోడలు, సెంటర్ డివైడర్లు, భవనాలపై పోస్టర్లు అంటించకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇష్టారాజ్యంగా పోస్టర్లు అంటించేవారిపై జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ఇప్పటికే డివైడర్లు, గోడలపై, ప్రభుత్వ కార్యాలయ భవనాలపై వేసిన పోస్టర్లను కార్పొరేషన్ సిబ్బందితో శుభ్రం చేయిస్తున్నామని తెలిపారు.

శరవేగంగా అభివృద్ధి పనులు

ఇడా చైర్‌పర్సన్ మధ్యాహ్నపు ఈశ్వరి



ఇడా కార్యాలయంలో సిబ్బందితో సమీక్షిస్తున్న ఇడా చైర్‌పర్సన్ ఈశ్వరి

ఏలూరు టౌన్: ఏలూరు శివారు శనివారపుపేట ప్రాంతంలోని జగనన్న టౌన్‌షిప్‌లో అభివృద్ధి పనులను శరవేగంగా పూర్తి చేయాలని ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఇడా) చైర్‌పర్సన్ మధ్యాహ్నపు ఈశ్వరి అన్నారు. పనుల ప్రగతిపై ఏలూరు చంద్రగుప్తకాలనీలోని ఇడా కార్యాలయంలో మంగళవారం అధికారులతో సమీక్షించారు. ఇడా ఆధ్వర్యంలో చేపట్టే పలు అభివృద్ధి పనుల ప్రగతి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని, ప్రత్యేకంగా పర్యవేక్షణ చేయాలని అధికారులను ఆదేశించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని తెలిపారు. అనుమతులు లేని లేఅవుట్లపై చర్యలు తీసుకోవాలని, ప్లానింగ్ అధికారులు నిత్యం అనధికార లేఅవుట్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఇడా పరిధిలోని పలు ప్రాంతాల్లో పార్కుల అభివృద్ధికి చర్యలు తీసుకున్నామని చెప్పారు. సమావేశంలో ఇడా వైస్ చైర్మన్ డి.చంద్రశేఖర్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు మధ్యాహ్నపు బలరాం, పీఓ సురేఖ, డీఈ సత్యనారాయణ, సిబ్బంది ఉన్నారు.

లారీ స్టాండ్ల అభివృద్ధికి స్థలాల పరిశీలన

దెందులూరు: మండలంలోని సింగవరం, కొత్తగూడెం గ్రామాల్లోని లారీ స్టాండ్ల స్థలాలను కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ పరిశీలించారు. హెచ్‌సీఎల్, నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా సంయుక్తంగా లారీల స్టాండ్‌ను అభివృద్ధి చేసేందుకు నిర్ణయం తీసుకున్నట్టు ఆయన అన్నారు. రెండు గ్రామాల్లోని లారీ స్టాండ్లను కలెక్టర్ పరిశీలించారు. సింగవరం, కొత్తగూడెంలో ఎన్ని ఎకరాల విస్తీర్ణంలో భూములున్నాయి, వాటి సరిహద్దులు, ఇతర సమస్యలు ఏమైనా ఉన్నాయా అంటూ తహసీల్దార్ ఎన్‌వీ నాంచారయ్యను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రెండు స్టాండ్ల సర్వే నంబర్లు, సరిహద్దులు ప్రస్తుత స్థితిని తహసీల్దార్ నాంచారయ్య కలెక్టర్‌కు వివరించారు. హెచ్‌సీఎల్, నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా సంయుక్తంగా అభివృద్ధి చేసే బృహత్తర కార్యక్రమమని వివరించారు.